ప్రజాశక్తి
ఆదివారం 8 జనవరి 2023
5
విజయనగరం




రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రూ.లక్ష

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈనెల 23,24,25 తేదీల్లో నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరగనున్న అండర్-17 కబడ్డీ బాల బాలికల అంతర్ జిల్లా టోర్నమెంట్ నిర్వాహకుకు జిల్లా పరిషత్ నిధులు నుంచి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు లక్ష రూపాయల మంజూరు చేశారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో టోర్నమెంట్ నిర్వాహకులకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ. రాజకుమార్ గారు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎలిజె రమణ, నెల్లిమర్ల మండలం వైఎస్ ఎంపిపి వైకుంఠనాయుడు, కబడ్డీ టోర్నమెంట్ నిర్వాహకులు పతివాడ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెంఛన్ల చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఎంపి మాధవి

అవ్వా తాతల కళ్లల్లో ఆనందం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట


ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పింఛన్ల పెంపు కొత్త పింఛన్లు మంజూరుతో అవ్వా తాతల కళ్లల్లో ఆనందాన్ని నింపారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి కొత్తగా మంజూరైన 330 పింఛన్లను ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వనని, రూ.64 లక్షల పింఛన్లు అందిస్తున్నారని, పాచిపెంట మండలంలో సుమారు 7వేల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గత టిడిపి హయాంలో కొత్త పెన్షన్ మంజూరు చేయాలంటే పాత పెన్షన్‌దారులు చనిపోతే కొత్త పెన్షన్ మంజూరయ్యేవని, అది కూడా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి ఉండేదని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. సూర్యుడు ఉదయించక ముందే ఒకటో తేదీన తలుపు తట్టి వాలంటీర్లు పింఛన్లు అందచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపి గొట్టేటి మాధవి, ఎంపిపి బి.ప్రమీల, జెడ్‌పి వైస్‌చైర్మన్ కె.సింహాచలం, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లు 58,060

ఓటు నమోదు, మార్పులకు ఇంకా అవకాశం : జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 58,060 మంది ఉన్నారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు చెప్పారు. ఎంఎల్‌సి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకొనేందుకు పట్టభద్రులకు ఇంకా అవకాశం ఉందని తెలిపారు. ఓటర్ల జాబితాను ఇటీవల ప్రచురించిన నేపథ్యంలో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఒ తన ఛాంబర్లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా వివరాలను వెల్లడించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడి, నామినేషన్ల గడువు ముగియడానికి 10 రోజుల ముందు వరకు ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టభద్రులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఓటు చేర్పించుకోడానికి ఫారమ్-18, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు ఫారమ్-7, ఫారమ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల వివరాలు				
రెవెన్యూ డివిజన్	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
బొబ్బిలి	7169	3302	2	10,473
చీపురుపల్లి	10,296	3904	1	14,201
విజయనగరం	20,870	12,510	6	33,386
మొత్తం	38,335	19716	9	58,060

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంలో గతంతో పోలిస్తే ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మొత్తం నియోజకవర్గంలో 2,83,749 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 58,060 మంది విజయనగరం జిల్లాలోనే ఉన్నారని వివరించారు. ఓటర్ల జాబితాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ లో పొందుపర్చినట్లు తెలిపారు. సమావేశంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ పివి మహేష్, వైసిపి నాయకులు రొంగలి పోతన్న, రెడ్డి, టిడిపి నాయకులు సిహెచ్ కుటుంబరావు, కాంగ్రెస్ నాయకులు ఎస్.సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో సౌకర్యవంతమైన ప్రయాణం

డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట



సంక్రాంతి పండగ నేపథ్యంలో రాకపోకలు సాగించే వారంతా ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణం సాగించాలని విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతికి రవాణా సదుపాయం కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వెళ్లిన వలస కూలీలు, పై చదువులకు వెళ్లిన విద్యార్థులు, ఉద్యోగ నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతికి స్వగ్రామాలకు వస్తుంటారని తెలిపారు. వీరికి ప్రయాణం సాఫీగా సాగేందుకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విజయనగరం డిపో నుంచి 9వ తేదీన ఒక సూపర్ లగ్జరీ, 10న రెండు సూపర్ లగ్జరీలు 11వ తేదీన మూడు సూపర్ లగ్జరీలు, 12వ తేదీన రెండు సూపర్ లగ్జరీ బస్సులు హైదరాబాద్ నుంచి విజయనగరానికి నడుపుతున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో 16 17 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు ప్రయాణికుల రద్దీని బట్టి నడుపుతామన్నారు. విశాఖపట్నం నుంచి ఎస్ కోట, విజయనగరం డిపోలకు చెందిన 60 బస్సులు 12 13 తేదీల్లో 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. రెండు వైపుల వెబ్‌సైట్‌లో టిక్కెట్‌ను బుక్ చేసుకోవచ్చునన్నారు. రెండువైపుల టిక్కెట్లును చేసుకున్న వారికి ఛార్జీలు 10శాతం రాయితీ, సీనియర్ సిటిజన్స్‌కు 25శాతం ప్రయాణ ఛార్జీలో రాయితీ ఉంటుందని తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందిస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

9న ఎస్.కోటలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో ఈ నెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేష్‌కుమార్, జాబ్‌మేళా కోఆర్డినేటర్ జి.ఈరన్న ఒక ప్రకటనలో తెలిపారు. 2019, 20, 21 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని చెప్పారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9000234642 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

9న వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 9న గురజాడ పబ్లిక్ స్కూలులో అన్ని యాజమాన్యాల పీడీ, పిఇటిలకు ఖేల్ ఇండియా రిజిస్ట్రేషన్, అప్ లోడింగ్ స్టూడెంట్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు డిఇఒ లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలనుండి 12 గంటలవరకు రాజాం, చీపురుపల్లి, బొబ్బిలి నియోజకవర్గం వ్యాయామ ఉపాధ్యాయులకు, ప్రైవేట్ స్కూళ్ల పీడీ, పిఇటిలకు , మధ్యాహ్నం 1.30 గంటలకు ఎస్ కోట, నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గం పీడీ, పిఇటిలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరంతా సకాంలో హాజరు కావాలని కోరారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు రౌతు రామ్మూర్తి

జిఒ 1తో పౌరహక్కులపై దాడి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పౌర హక్కులపై దాడి చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఒకటిని తీసుకువచ్చిందని టిడిపి నాయకులు రౌతు రామ్మూర్తి, సిపిఎం పట్టణ అధ్యక్షులు పి.శంకరరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు, సిపిఐ పట్టణ అధ్యక్షులు మునకాల శ్రీనివాస్ అన్నారు. గంటి ప్రసాదం భవనంలో జీవో ఒకటికి వ్యతిరేకంగా శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రౌతు రామమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు సభలకు వేలాది సంఖ్యలో జనం రావడంతో అభద్రతతో రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోను తీసుకొచ్చిందని అన్నారు. బ్రిటిష్ కాలం నాటి జిఒను వైసిపి ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమన్నారు. శంకరరావు, మునకాల శ్రీనివాస్, మువ్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతులు రోడ్లపైకి వస్తున్నారన్నారు. నిరసన తెలిపే హక్కుపై దాడి చేసేందుకు ఈజీవోను ఉపయోగిస్తారని అన్నారు. వెంటనే జీవో ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సిపిఎం మండల అధ్యక్షులు ఎస్.గోపాలం, రైతు కూలీ సంఘం నాయకులు వి.కృష్ణ, ఇఫ్టూ నాయకులు పి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

లా కళాశాలను ప్రభుత్వమే నడపాలి

ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఉమ్మడిజిల్లాలోగల ఏకైన ఎంఆర్ లా కళాశాలను ఎత్తివేసేందుకు ప్రయత్నించడం సరైనది కాదని, కళాశాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వమే నడపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్య దర్శి రెడ్డి శంకరరావు అధ్యక్షతన కోట వెనుక ఉన్న ఎన్‌ఎఫ్‌టిఇ కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 2023లో జరుగుతున్న అడ్మిషన్‌ల జాబితా నుంచి ఎంఆర్ లా కళాశాలను తొలగించారని, దీంతో విద్యార్థులు న్యాయ విద్యకు దూరమయ్యారని అన్నారు. జిల్లాలో 36 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ కళాశాలను కనుమరుగు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కళాశాలను కొనసాగించాలని ఇప్పటికే డిప్యూటీ స్పీకర్‌కు, దేవాదాయశాఖ అధికారులకు వినతులు ఇచ్చామని, మాన్సాస్ యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చేసిన తీర్మానం కాపీని కలెక్టర్‌కు వినతి అందజేస్తామన్నారు. సమావేశంలో ఎంఆర్ లా కళాశాల పూర్వ విద్యార్థులు ఎం వి ఎన్ వెంకటరావు, ప్రకాశ్, ఎంఆర్ ఎయిడెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయపాల్, విశ్వభూషన్, వర్మ, డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, జిల్లా కార్యదర్శి శశిధర్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ గణేశ్, విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వి. రామచంద్రరావు, నగర అధ్యక్షులు, త్రినాథ్ , పోస్టల్ యూనియన్ కార్యదర్శి ఇఎస్ నాయుడు, టెలికం నాయకులు భాస్కరరావు, తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పిపిఎస్ఎస్ కార్యదర్శి రెడ్డి శంకరరావు



సుచరితను సత్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెడిసిన్ ర్యాంకర్‌కు అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన సూపర్ స్పెషాలిటీ ఎంట్రన్స్ టెస్ట్ లో 5వ ర్యాంకు సాధించిన నగరంలోని తూర్పు బలిజి వీధికి చెందిన డాక్టర్ అవనాపు సుచరితను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం అభినందించారు. సుచరిత జనరల్ మెడిసిన్‌లో 5వ స్థానం సాధించింది. ఆసియా ఖండంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆసియా గ్యాస్ట్రోలజి ఇనిస్టిట్యూట్ లో గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్‌గా సీటు పొందారు. ఈ సందర్భంగా ఆమెను జెడ్‌పి చైర్మన్ సన్మానించారు. సుచరిత తండ్రి అవనాపు సూర్య ప్రకాశ రావు పంచాయితీరాజ్‌శాఖ లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. తల్లి అవనాపు రాధ గృహిణి, సోదరుడు అవనాపు శ్రీ రామ్ నాయుడు సాఫ్ట్ వేర్ ఇంజినీరు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణరాజు, కనకల రఘురామారావు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

గంజాయి విక్రయం, రవాణ, సేవించిన వారిపై కఠిన చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్‌పి ఎం. దీపిక తెలిపారు. గంజాయి సేవించే వారిపైన, వారికి గంజాయి విక్రయించే వారిపైనా కఠిన చర్యలు చేపట్టేందుకు జిల్లా పోలీసుశాఖ ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ బృందం గంజాయి సేవించేందుకు అనుకూలంగా ఉన్న నిర్మానుష్య ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. గంజాయి చిన్న మొత్తాల్లో విక్రయించే వారిపైన కూడా ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. గత 10రోజుల్లో గంజాయి సేవించిన వారిపై 15కేసులు, వాటిని విక్రయిస్తున్న వారిపై మూడు కేసులు నమోదు చేసి, నిందితులను రిమాండుకు తరలించామన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈ బృందం ఇకపై దాడులు కొనసాగిస్తుందన్నారు. ఈబృందాన్ని ప్రోత్సహించడంలో భాగంగా 5గురు కానిస్టేబుళ్లను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను, ప్రోత్సాహక బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ జి. రాంబాబు, ఎస్ఐ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

శిశుగృహ నిర్వహణ భేష్

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక శిశుసంరక్షణ కేంద్రాన్ని కర్నూలుకు చెందిన శిశు సంరక్షణ అధికారుల బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా శిశు గృహ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. శిశుగృహలో మేట్రిన్ ఆర్.సంధ్య ఆధ్వర్యాన హాస్టల్ నిర్వహణ, చిన్నారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిసరాలు, వసతిగృహంలో పరిశుభ్రతను చూసి కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలో 24 మంది పిల్లలు మాత్రమే ఉండడంతో మరింత మందిని చేర్పించాలని మేట్రిన్‌కు సూచించారు. వసతి గృహం నిర్వహణ బాగుందంటూ మేట్రిన్‌ను ప్రశంసించారు.

పాటూరు ఘటనపై దర్యాప్తు

ప్రజాశక్తి-వేపాడ

ఈ నెల ఐదో తేదిన మధ్యాహ్నం 12 గంటల వరకు పాటూరు సచివాలయం తెరుచుకోకపోవడంపై 'ప్రజాశక్తి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది తీరుపై 6న గ్రామసభను సర్పంచ్, పాలకవర్గ సభ్యులు బహిష్కరించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్‌కు ఆదేశాలు జారీ చేశారు. పాటూరు గ్రామ సచివాలయంలో చోటుచేసుకున్న సంఘటనపై దర్యాప్తు చేయాలని ఇఒపిఆర్‌డిని ఎంపిడిఒ ఆదేశించారు.

చిట్టి గురువుల ఉత్తమ సేవలకు పురస్కారాలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చిట్టి గురువులు కార్యక్రమం విజయవంతం చేసిన వారు ఉత్తమ పురష్కారాలు అందుకున్నారు. శనివారం జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో చిట్టి గురువులు పాఠశాల విజయోత్సవ కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ మండలంలో చిట్టిగురువులు కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను మండల లిటరసీ అధికారి లింగాల ఈశ్వరరావుకు ఉత్తమ లిటరసీ అధికారిగా ప్రశంశాపత్రం, జ్ఞాపికను జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీలు పి. సూర్యనారాయణ రాజు, ఇందుకూరి రఘురాజు అందజేసారు. ఉత్తమ చిట్టి గురువులుగా బర్రి నందిని (ఎంపియుపి స్కూల్, చింతపల్లి), దిండి పల్లవి (జెడ్పిహెచ్ఎస్ కెఎమ్‌డి) ఎంపికయ్యారు. ఉత్తమ వెల్ఫేర్ అసిస్టెంట్లుగా కె.సౌజన్య, ఆళ్ల రాంబాబు, షేక్ బాబూలాల్, అవార్డులు అందుకున్నారు.



పురస్కారాలతో ఎంఎల్ఓ ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్ జయప్రసాద్, తదితరులు


రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - గరివిడి

ఈ నెల 5,6,7 తేదీల్లో జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో పాల్గొని స్థానిక అవంతీస్ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సత్తాను చాటారు. కబడ్డీ బాయ్స్, బాడ్మింటన్ గర్ల్స్ సింగిల్, టేబుల్ టెన్నిస్ బాయ్స్ సింగిల్, టేబుల్ టెన్నిస్ గర్ల్స్ డబుల్స్ ల్లో మొదటి బహుమతిని, టేబుల్ టెన్నిస్ బాయ్స్ డబుల్స్‌లో ద్వితీయ బహుమతిని, 200 మీటర్స్ గర్ల్స్, 800 మీటర్స్ గర్ల్స్, షాట్ పుట్, డిస్కస్ త్రో, 200 మీటర్స్ బాయ్స్ ,100 మీటర్స్ బాయ్స్ లల్లో తృతీయ బహుమతిని సాధించారు. కబడ్డీలో బెస్ట్ డిఫెండర్ సాధించారు. ఎమ్.భార్గవ్, ఎన్.హరికృష్ణ, ఏ.శోభన్, నవ్య, స్రవంతి, కంది స్వప్న, తేజవర్ధన్, రమ్య, అలేఖ్య, కిషోర్, శివశంకర్, ప్రసాద్, ఐ.గంగరాజు, ఎమ్. గణేష్ దొర తదితర విద్యార్థులు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నికల్ కాలేజ్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్, తదితరులు క్రీడాకారులను అభినందించారు.

బిసిలు ఓటు బ్యాంకు మాత్రమే కారాదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



గత కొద్దిరోజులుగా జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు బిసిల జపం చేస్తున్నాయి. అందులోనూ ముఖ్యంగా విజయనగరం జిల్లా కేంద్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ఇదే పనిలో ఉన్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రభుత్వ పదవీ కాలం మరో ఏడాదిన్నర సమయం ఉన్నప్పటికీ అప్పుడే ఎన్నికల వాతావరణం మొదలైంది. ఈనేపథ్యంలో పాలకపార్టీలు బిసిలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సహజమే. దశాబ్దాల తరబడి ఇదే తంతుగా ఉంది. ఈ సంగతి కాస్త పక్కనబెడితే ఇటీవల జిల్లాలో మూడు రోజులపాటు పర్యటించిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మెజార్టీగావున్న బిసిలను పక్కనబెట్టి ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పెత్తనం చలాయిస్తున్నారంటూ భారీ స్థాయిలో విమర్శలు చేశారు. ఇటువంటి విమర్శలు కాస్త ఒసి నేతల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఆ రకంగా చూసుకుంటే విజయనగరం నియోజకవర్గంలో ఎక్కువ మంది బిసిలు ఉన్నప్పటికీ అధికార ప్రతిపక్షాల్లో ఒసిల పెత్తనం పెచ్చుమీరింది. అంతెందుకు గడిచిన 50ఏళ్లలో ఒకే ఒకసారి బిసి సామాజికవర్గానికి చెందినవారు (మీసాల గీత) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టిడిపిగానీ, వైసిపిగానీ ఎక్కువ సందర్భాల్లో రాజులు, క్షత్రియులకే ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశాన్ని కల్పించాయి. ఇటువంటి తరుణంలో ఇటీవల జిల్లాకు వచ్చిన చంద్రబాబు ఉత్తరాంధ్రా రాజకీయాలను ఉద్దేశిస్తూ బిసిలకు అన్యాయం జరుగుతుందని చెప్పిన విషయం విధితమే. ఇదే నినాదంతో గత కొంతకాలంలో టిడిపి, వైసిపిలోని అసమ్మతీయులు బిసి నినాదంతో ముందుకు సాగుతున్నారు. దీంతో, నాలుగు రోజుల క్రితం సావిత్రీ బాయ్ పూలే జయంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఆమె విగ్రహాన్ని జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే (డిప్యూటీ స్పీకర్) కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించిన విషయం విధితమే. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ బిసి సంఘాల విజ్ఞప్తి మేరకు ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని చెప్పారు. వాస్తవానికి సావిత్రి భాయ్ పూలే కేవలం బిసిలకే కాదు, యావత్తు సమాజానికీ, ముఖ్యంగా స్త్రీ జాతికి ఎంతో ఆదర్శం. అయినా స్వామి బిసిల కోసం ప్రస్తావన చేయడం వెనుక ఇటీవల చంద్రబాబు వ్యాఖ్యలు, వైసిపిలోని కొంతమంది బిసి నాయుల వేరు కుంపటి వంటి పరిణామాలను ఎదుర్కొనేందుకేనని జనం చర్చించుకుంటున్నారు. ఇటు టిడిపిలో మాజీ ఎమ్మెల్యే మీసాల గీత సహా బిసి సామాజికవర్గానికి చెందిన పలువురు మాజీ కౌన్సిలర్లు రెబల్‌గా ఉండడంతో టిడిపిలో బిసియేతర సామాజికవర్గానికి చెందిన అశోక్‌గజపతిరాజు కూడా తన అనుయాలతో బిసి జపం చేయిస్తున్నారు. అప్పుడప్పుడూ ఆయన కూడా బిసిల జపం చేస్తున్నారు. వాస్తవానికి విజయనగరంలో పేరకు బిసిలు ఎన్నో పదవులు అలంకరించినప్పటికీ పెత్తనం మాత్రం బిసియేతరులే చలాయిస్తున్నారని పలువురి వాదన. అందువల్లే ఇరు పార్టీల్లోనూ కొంతమంది నాయకులు ఆయా పార్టీలకు దూరమయ్యారు. ఈ మాటకొస్తే బిసి రిజర్వేషన్‌తో విజయనగరం తొలిమేయర్‌గా ఎన్నికైన వెంపడాపు విజయలక్ష్మికి పరిపాలనలోవున్న స్వేచ్ఛ ఎంత? అన్నది పరిశీలిస్తే నేతిబీరకాయలో నెయ్యి వెతికిన చందమే అన్నది మెజార్టీ కార్పొరేటర్ల ఆవేదన. కార్పొరేటర్లే కాదు, రాజకీయ నాయకులు, కాస్త పాలనాపరమైన అంశాలపై అవగాహన ఉన్నవారు సైతం ఇదే మాట చెబుతున్నారు. కార్పొరేషన్‌తోపాటు మేయర్ పదవిపైనా బిసియేతరులదే పెత్తనంగా ఉందని వాదిస్తున్నారు. అంతకు ముందు టిడిపి తరపున మున్సిపల్ ఛైర్మన్లుగా ఎన్నికైనవారికి కూడా స్వతంత్ర్యంగా పనిచేసే అవకాశం కలగలేదు. ఇలా కేవలం బిసిలకు రిజర్వేషన్లు బట్టి తప్పనిసరి పరిస్థితుల్లో పదవులు కట్టబెట్టడం తప్ప అధికారం బిసియేతరులే చలాయిస్తున్నారంటూ జనం చర్చించుకుంటున్నారు. ఇటువంటి తరుణంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు మరోసారి బిసి నినాదాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.




సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పథకాలపై ఆరా తీస్తూ ...

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఒకటో డివిజన్‌లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ పథకాలు వచ్చిన వారే కాకుండా పొందలేని వారి ఇళ్లకు కూడా వెళ్లి ప్రభుత్వ పాలనా తీరు పట్ల అడిగి తెలుసుకుంటున్నారన్నారు. స్థానిక వైసిపి నాయకులు ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక సమస్యలను కూడా తెలుసుకొని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పరిష్కరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజేశ్వరి

సౌకర్యాల కల్పనకు గ్రామసభలే కీలకం

ప్రజాశక్తి-వేపాడ

గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు గ్రామసభలే కీలకమని వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి తెలిపారు. మండలంలోని వావిలపాడు సచివాలయం వద్ద శనివారం గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సరైన ప్రణాళిక రూపొందించుకుంటే గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపొచ్చని చెప్పారు. అందుకే పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కన్యాకుమారి, ఉప సర్పంచ్ జి.వెంకటలక్ష్మి, సచివాలయ కన్వీనర్ బీల సతీష్, నాగిరెడ్డి రాజునాయుడు, జి.పద్మ, పి.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ స్వరూపారాణి

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి- డెంకాడ

జగనన్న ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ డిడి.స్వరూపారాణి కోరారు. మండలంలోని రఘుమండ గ్రామంలో హౌసింగ్ డే సందర్భంగా జగనన్న కాలనీలను ఆమె శనివారం సందర్శించారు. ఈ గ్రామంలో ఇంకా ఇంటి నిర్మాణాలు చేపట్టని 22 మందికి అవగాహన కల్పించారు. త్వరితగతిన ఇల్లు పూర్తి చేయడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం అమకాం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు సలహాలు అందజేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పిల్లలకు వండిన వంటకాన్ని పిల్లలతో పాటు రుచి చూశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తాచాటిన 'సాయిరంగా' విద్యార్థులు


ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదానంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సాయిరంగా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. వాలీబాల్, ట్రిపుల్ జంప్, బ్యాడ్మింటన్ విజయం సాధించారు. కళాశాల వాలీబాల్ జట్టును, ట్రిపుల్ జంప్, బ్యాడ్మింటన్‌లో విజయం సాధించిన సేనాపతి దుర్గాప్రసాద్, సేనాపతి ధర్మారావును ప్రిన్సిపల్ అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరం

ప్రజాశక్తి-బొబ్బిలి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ కోరారు. ఎస్ఎస్ఎస్ డిగ్రీ, శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం క్షీణించి జీవితాలు నాశనం అవుతాయన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్స్, సిబ్బంది పాల్గొన్నారు.



పాదయాత్ర చేపడుతున్న జగదీష్ బాబు, ట్రస్టు సభ్యులు

పాదయాత్రగా సింహాచలానికి..

ప్రజాశక్తి-కొత్తవలస

మంగళపాలెం వద్దనున్న గురుదేవ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాపర్తి జగదీష్ బాబు ఆధ్వర్యాన సభ్యులు సింహాచలం దేవస్థానానికి పాదయాత్ర చేపట్టారు. సుమారు 2 వేల మంది ట్రస్టు సభ్యులు శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ట్రస్టు నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఏటా సింహాచలం దేవస్థానానికి పాదయాత్ర చేపట్టడం ఆనవాయితీగా వస్తుందని జగదీష్‌బాబు తెలిపారు.

రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు వైష్ణవి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఎంఆర్ పార్వతి కళాశాల విద్యార్థిని వి.వైష్ణవి శ్వేత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23న నేతాజీ జయంతి సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో యువతకు మాట్లాడే అవకాశం కల్పించేందుకు యువతి యువకుల ఎంపిక శనివారం ఎంఆర్ డిగ్రీ కళాశాలలో కన్వెన్షన్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారి నుండి ఒకరికి జాతీయ స్థాయికి ఎంపిక చేసి పార్లమెంట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు.



మాట్లాడుతున్న వైష్ణవి

సంపూర్ణ ఆరోగ్యమే సఖి ఉద్దేశం

మేయర్ విజయలక్ష్మి



విజయనగరంటౌన్.. మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాలికలందరికి విద్య, సంపూర్ణ ఆరోగ్యం సాధించడమే సఖి ముఖ్య ఉద్దేశమని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు పాల్గొన్న ఈ సమావేశంలో ముందుగా సఖి కార్యక్రమం ఉద్దేశాన్ని ఐసిడిఎస్ సిడిపిఒ ప్రసన్నకుమారి వివరించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలిక రక్షణ, సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక విధాల కృషి చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో బాలికల ప్రవర్తన, ఆరోగ్య పరిస్థితి, మానసిక స్థితిగతులపై సంపూర్ణ అవగాహన తీసుకొచ్చిన నాడే సత్ఫలితాలు వస్తాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇందుకోసం అందరూ సమన్వయంతో కృషి చేసి బాలికలలో సంపూర్ణ పౌష్టికాహారం, ఆరోగ్యం చట్టాలపై అవగాహన, మంచి ఆలోచనలను వివరించేందుకు కృషి చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పోటీ పడుతున్నప్పటికీ అక్కడక్కడ వివక్షకు గురికావాల్సి వస్తుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకువచ్చేందుకు బాలికల్లో మానసిక ధైర్యాన్ని స్థైర్యాన్ని నింపాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, యునిసెఫ్ ప్రతినిధి శివ, ఎంఇఒ రాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : విద్య, సంపూర్ణ ఆరోగ్యమే సఖి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన శనివారం ఏర్పాటు చేసిన సఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికలందరూ విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన నాడే సంపూర్ణ ఆరోగ్యం సాధించగలరని తెలిపారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు 9 నుంచి 21 ఏళ్ల విద్యార్థినులకు అవగాహన కల్పించినాడే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. ముందుగా వేపాడ, బొద్దాం పిహెచ్‌సిల వైద్యులు ఎ.ధరణి, రమాదేవి మాట్లాడారు. సమావేశంలో ఎంఇఒ జి.శ్రీదేవి, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, ఎపిఎం , ఐసిడిఎస్ పిఒ రొంగలి ఉమాదేవి, సూపర్వైజర్లు కామేశ్వరి, శ్రీదేవి పాల్గొన్నారు.

గజపతినగరం : సఖి గ్రూపులను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ బాబు అన్నారు. శనివారం మండలంలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కిశోర బాలికలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు సఖి గ్రూపుల్లో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. దిశ యాప్, ఫోక్సో చట్టం, మంచి,చెడు ప్రవర్తనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడు, ఐసిడిఎస్ పిఒ నాగమణి, ఎంపిడిఒ పి.సుదర్శన్, తహశీల్దార్ ఎం.అరుణకుమారి, డాక్టర్ ఎం.సాయి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల, పట్టణ సఖీ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.రమణ మూర్తి పాల్గొని మాట్లాడారు. సఖీ కమిటీల ద్వారా 9 నుంచి 20సంవత్సరాల బాలికలకు విద్య, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని మాట్లాడుతూ గుడ్, బ్యాడ్ టచ్‌లు, వేధింపులు, పౌష్టికాహారం, యుక్త వయసులో ఉన్న వారు, నూతన దంపతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గ్రామ, మండల, పట్టణ సఖీ కమిటీ సభ్యులు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సమావేశంలో మండల సఖీ కమిటీ కన్వీనర్, ఎంపిడిఒ జి. గిరిబాల, తహశీల్దార్ కె.వి. రమణ రాజు, ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీ రావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.సత్యవతి, సూపర్ వైజర్ బి. శకుంతల, వైద్యులు రవీంద్ర, మెప్మా సిఎంఎం డి. గోవింద రావు, అంగన్ వాడీలు, ఎంఎస్‌కెలు పాల్గొన్నారు.



వేపాడ.. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

ఎమ్మెల్యేలు శంబంగి, కంబాల




బొబ్బిలిరూరల్.. పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ పింఛను కానుక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలా జన్మభూమి కమిటీల పేరుతో పథకాలు ఆ పార్టీ కార్యకర్తలకే అందిచే వారని చెప్పారు. ప్రస్తుతం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని తెలిపారు. బొబ్బిలి మండల పరిధిలో 393 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, వైస్ ఎంపిపి అరసాడ శంకర్రావు, తహశీల్దార్ రాజారావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, వ్యవసాయశాఖ ఎడి శ్యామసుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

వంగర : అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు అన్నారు. మండలానికి కొత్తగా మంజూరైన 164 పెన్షన్లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేతుల మీదుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం జన్మభూమి కమిటీలు పేరు చెప్పి ప్రజలను ఇబ్బందులకు గురు చేసిందని, వైసిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, మండల వైసిపి కన్వీనర్ కరణం సుదర్శనరావు, తహశీల్దార్ డి ఐజాక్, ఎంపిడిఒ శంకరరావు, వంగర సర్పంచ్ కనగల భారతి, ఎంపిటిసి, కనగల పద్మ, బొక్కేల వెంకట అప్పలనాయుడు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



వంగర.. పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రెండోరోజూ షాపుల బంద్

ప్రజాశక్తి-బొబ్బిలి

కళాసీల సమ్మెకు వ్యతిరేకంగా వ్యాపారులు రెండోరోజు శనివారం షాపులు మూసివేశారు. వ్యాపారులు పట్టణంలో ర్యాలీ చేపట్టి, తెరిచిన షాపులను మూసివేయించారు. కళాసీలకు వేతనాలు ఎక్కువ ఉన్నా సమ్మె చేయడం సరికాదని వ్యాపారులు కె.శ్రీనివాసరావు, జి.ముత్యాలు తెలిపారు. అనంతరం పట్టణ సిఐ నాగేశ్వరరావు, తహశీల్దార్ రాజారావుకు వినతిపత్రం అందజేశారు.

వ్యాపారుల వైఖరిపై విమర్శలు

పట్టణంలో వ్యాపారుల వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొట్టకూటి కోసం షాపులలో పని చేస్తున్న కళాసీల వేతనాలు పెంచాలని కోరితే పట్టించుకోకుండా, వారికి వ్యతిరేకంగా వ్యాపారులు ఆందోళన చేయడం సరికాదని ప్రజలంటున్నారు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతుంటే కళాసీల వేతనాలు పెంచకుండా ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదని చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కళాసీల వేతన ఒప్పందం చేయాలని కోరుతున్నారు.

యువతను మోసగించిన సిఎం

జనసేన



బొబ్బిలిలో ర్యాలీ చేపడుతున్న జనసేన నాయకులు, యువత

ప్రజాశక్తి-కొత్తవలస

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి యువతను వంచించారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి అన్నారు. కొత్తవలసలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి లేక ఉత్తరాంధ్ర యువత ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారని చెప్పారు. ఉత్తరాంధ్ర యువతను ఆదుకునేందుకు జనసేనాని పవన్ కళ్యాణ్ శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈ నెల 12న యువశక్తి బహిరంగ సభ నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జనసేన మండల అధ్యక్షులు నక్కరాజు సతీష్, నియోజకవర్గ నాయకులు వబ్బిన సత్యనారాయణ, వబ్బిన సన్యాసి నాయుడు, సేనాపతి కొండలరావు, పెద్దిరెడ్ల రాజశేఖర్, నాయకులు గొరపల్లి రవికుమార్, మల్లువలస శ్రీను, రామదుర్గ కాశి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన స్థానిక నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్తరాంధ్ర యువత గళాన్ని పవన్ వినిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు వబ్బిన సత్యనారాయణ, మండల అధ్యక్షులు లోకాభి రామకోటి తాండ్రంగి చంటి, మోపాడ చిన్ని, గంధవరపు సతీష్, వబ్బిన సన్యాసి నాయుడు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : జనసేనతో యువతకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బి.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. రణస్థలంలో జరిగే యువశక్తి సభను జయప్రదం చేయాలని శనివారం జనసేన ఆధ్వర్యంలో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన అధికారంలోకి వస్తే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తుందన్నారు.

విజయనగరం టౌన్ : యువశక్తి సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ పిఎసి సభ్యులు పితాని బాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం గురాన అయ్యలు ఆధ్వర్యంలో స్థానిక గాయిత్రీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి యువ శక్తి సభ గురించి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యువత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు గురాన అయ్యలు, ఆదాడ మోహన్ రావు , కాటం అశ్విని, రాజేంద్ర, టి.రామకృష్ణ (బాలు), రవితేజ, చక్రవర్తి, వజ్రపు నవీన్ కుమార్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి- రేగిడి, రాజాం

మాజీ మంత్రి, టిడిపి రాజాం నియోజకవర్గం ఇంచార్జి కోండ్రు మురళీమోహన్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని వివిధ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు శనివారం రక్తదానం చేశారు. టిడిపి రాజాం టౌన్ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్ ఆధ్వర్యంలో రాజాం పట్టణంలో 69 మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి స్ఫూర్తి దాయకంగా నిలిచారు. ఈ రక్తాన్ని రెడ్ క్రాస్‌కు అప్పగించారు. రక్తాన్నిచ్చిన 69 మందికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్, టిడిపి నాయకులు పొట్నూ చిట్టిబాబు, పి.సత్యం నాయుడు, టి.కన్నంనాయుడు, కె.రవీంద్ర, ముగడ శ్రీను, కోటి శ్రీను, జగన్నాథం, జి.రమేష్, కె.రవి, ఎ.శ్రీను, జె.నీలయ్య, తాడి రాము, పి.గౌరీస్వరారావు, బి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి మన వంతు సహకారం అందించాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ కోరారు. శనివారం మండలంలోని రామతీర్థం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల గురించి వివరించారు. బాల్య వివాహాలు ఎక్కడైన జరిగితే 112 టోల్ ఫ్రీ నంబరునకు సమాచారం అందించాలన్నారు. హీమోగ్లోబిన్ 12 శాతం కంటే తక్కువ ఉంటే పోషక విలువలు ఉన్న ఆహారం మరింత ఎక్కువగా తీసుకోవాలన్నారు. రక్తహీనత వల్ల జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుందని, వేగంగా అలసటకు గురవుతారని వివరించారు. కరోనా వైరస్ నుంచి రక్షణ కోసం ప్రతి ఒకరు మాస్కులు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.విమల, బి.శ్రీనివాసరావు, టి.విశ్వేశ్వరరావు, కన్నబాబు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి

అనంతరం కొత్తపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేతుల పరిశుభ్రత వల్ల ప్రయోజనాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సూరినాయుడు, ఎంఎస్ఎన్ రాజు, భారతి, నారాయణరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిమితికి మించి లోడు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - వంగర

పరిమితికి మించి ట్రాక్టర్లలో చెరకు లోడ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి రేగిడి మండలంలోని సంకిలిలో ప్యారిస్ చక్కెర కర్మాగారానికి చెరకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్లతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు ఇరుకుగా ఉండటంతో పాటు ట్రాక్టర్‌లో పరిమితికి మించి చెరకు లోడ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పరిమితికి మించి లోడ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తం



అపరాల పంటను పరిశీలిస్తున్న ఎడి మహారాజన్

ప్రజాశక్తి-గజపతినగరం

రబీ సీజన్లో అపరాల పంటలో వచ్చే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి మహారాజన్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తబగ్గం గ్రామంలో అపరాల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో రబీలో 13,564 ఎకరాలలో అపరాలు సాగు చేసినట్లు తెలిపారు. పంటను పరిశీలించగా మారుకా మచ్చల పురుగు, బూడిద తెగులు ఎక్కువగా ఆశించినట్లు చెప్పారు. నివారణకు ప్రొపికోనజోల్ ఎ 1మి.లీ/లీటరు, 13.0.45 పోషక ఎరువును 5గ్రాములు/లీటరు నీటికి కలిపి 200 లీటర్లు పిచికారీ చేయాలని సూచించారు. మారుకా మచ్చల పురుగు మొదటి రెండు దశల్లో పూలమొగ్గల లోపల తింటాయని చెప్పారు. తరువాత దశలలో లేత ఆకులను, పూతను, లేత పిందెలను, కాయలను కలిపి గూడుగా చేసుకొని, కాయ అడుగుభాగాన చిన్న రంధ్రం చేసి లోపలికి వెళ్లి డొల్ల చేస్తుందన్నారు. ఈ పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ లీటరుకు 0.4 గ్రాములు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో విఎఎ సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు ఛిద్రం

రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

ప్రజాశక్తి- రేగిడి, రాజాం

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు ఛిద్రమవుతాయని రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. ఈ మేరకు రాజాం పట్టణంలోని మండల న్యాయ సేవాధికార, చైతన్య జూనియర్ కళాశాలల సంయుక్తంగా విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలై అనారోగ్యానికి గురవుతున్నారని వెల్లడించారు. భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని, సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరికి బానిసగా మార్చుతుందని చెప్పారు. డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా బాధితులు వెనుకాడరని స్నేహితులు, బాంధవ్యాలను మరచి ఒంటరివారవుతున్నారని వెల్లడించారు. చివరకి ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. యువత సన్మార్గాన్ని అలవర్చుకోవాలని, పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సదస్సులో రాజాం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వి.బి. కృష్ణ సాయి తేజ, న్యాయవాదులు రెడ్డి విజయకుమార్, చల్లా శ్యాంప్రసాద్, ముదిలి శ్రీనివాసరావు, లావేటి శ్రీహరినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ దర్మాన లక్ష్మునాయుడు, ఏఓ సురేష్, రాజాం టౌన్ ఎస్ఐ పి. నీలావతి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, డిఆర్‌పేటలో హౌసింగ్ డే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట, డిఆర్‌పేటలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. లేకుంటే ప్రభుత్వం ఇంటి స్థలాలను వెనక్కి తీసుకుని, అవసరమైన వారికి మంజూరు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట సర్పంచ్ వంటాకు శ్రీను, డిఆర్‌పేట గ్రామ నాయకులు దండుపాటి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



బీమా సాయం అందిస్తున్న సర్పంచ్ సూర్యకాంతం

బీమా నగదు అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఏటి అగ్రహారంలో ఇటీవల భవన నిర్మాణంలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన జమ్ము అప్పలనాయుడు కుటుంబానికి భీమా నగదు అందజేశారు. శనివారం గ్రామ సర్పంచ్ మీసాల సూర్య కాంతం చేతుల మీదుగా తక్షణ సహాయం కింద రూ.10వేలు అందించారు. వైయస్సార్ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి రూ.5లక్షలు మంజూరు కాగా మొదటి విడతలో రూ. 10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మీసాల తాతి నాయుడు, సెక్రెటరీ సంతోషి, గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కన్వీనర్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాక

ప్రజాశక్తి -భోగాపురం

ఈ నెల 8న జిల్లాకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్ రెడ్డి వస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ విలేకరులకు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ నెల 8, 9, 10 తేదీలలో 3 రోజుల పాటు పర్యటించి అనంతరం మన్యం జిల్లాలోని నియోజకవర్గాలను పర్యటిస్తారన్నారు. పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -భోగాపురం

మండలంలోని పోలిపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే జీవశాస్త్ర స్టడీ మెటీరియల్‌ను సర్పంచ్ కర్రోతు వెంకటరమణ పంపిణీ చేశారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు టి.చక్రవర్తి, జి.లక్ష్మయ్య ఆర్థిక సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.ఇందిరాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.